క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న భక్తుడు వెంకట సూరప్పారావు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణానికి సాయం అందజేస్తున్నారు. శనివారం మునగపాకకు చెందిన దొడ్డి చిన సన్యాసినాయుడు కుమారుడు వెంకట సూరప్పారావు రూ.10 వేలు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, కమిటీ సభ్యులు ఆడారి అచ్చియ్యనాయుడు, పాలిమేర కృష్ణ, పెంటకోట ఉమేష్, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశీబాబు, ఆడారి పరశురామ్, కేవీఎస్ అప్పారావు, పెంటకోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆదివారం భగవద్గీతపై అవగాహన

మునగపాక: తిమ్మరాజుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం భగవద్గీతపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు భగవద్గీత శ్లోకాలు, తాత్పర్యాలను విశ్రాంత పంచాయతీ రాజ్ ఇంజినీర్ శరగడం పరదేశినాయుడు వివరిస్తారని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



దిమిలి రోడ్డులో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

యలమంచిలి రూరల్: పట్టణంలో మూడు ఎరువుల దుకాణాల్లో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయాధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. మన గ్రోమోర్, గాయత్రి రైతు డిపో, శ్రీవెంకట రైతు డిపోల్లో రికార్డులు, కాంప్లెక్స్ ఎరువుల స్టాకు, అమ్మకం రిజిస్టర్లు తనిఖీ చేశారు. గోదాముల్లో నిల్వ ఉన్న స్టాకు, రికార్డుల్లో వివరాలకు వ్యత్యాసం పరిశీలించారు. యూరియా అధిక ధరకు విక్రయించడం, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడ్డం వంటివి చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని, లైసెన్సు రద్దు చేస్తామని వ్యాపారులను హెచ్చరించారు.

గ్రామస్తుల చేతిలో కొండచిలువ హతం



హతమార్చిన కొండ చిలువ

ఎస్.రాయవరం: రేవుపోలవరం గ్రామంలో నివాసాల మధ్యకు వచ్చిన భారీ కొండ చిలువను స్థానికులు హతమార్చారు. చంద్రరావు అనే వ్యక్తి ఇంటి సమీపంలో సుమారు 15 అడుగుల కొండచిలువ రావడంతో స్థానికులు ఆందోళన చెంది, కర్రలతో కొట్టి చంపారు.


నాగరత్నంకు ఘన నివాళి



నాగరత్నం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కన్నబాబురాజు, కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్

అచ్యుతాపురం రూరల్ : ఆవరాజాం వైఎస్సార్‌సీపీ నాయకుడు తేటకాల శ్రీను తల్లి నాగరత్నం ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు శనివారం జరిగిన సంతాప సభలో ఆమె చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, కరణం ధర్మశ్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అరకు పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, జెడ్పీటీసీ లాలం రాము, ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, మండల యువజన అధ్యక్షుడు కారుకుండి శ్రీను, ఎంపీటీసీలు రావి నాగలక్ష్మి, లాలం శ్రీను, రవీంద్రరాజు, కంఠంరెడ్డి వినన్న నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై డ్రోన్ నిఘా



వడ్డిప మార్గంలో డ్రోన్‌తో పరిశీలిస్తున్న పోలీసులు

రోలుగుంట : మండలంలో పూర్తి స్థాయిలో గంజాయి అక్రమ రవాణ అరికట్టేందుకు పోలీస్ శాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టింది. కొత్తకోట సీఐ కోటేశ్వరరావు రోలుగుంట ఎస్‌ఐ పి.రామకృష్ణారావుతో కలసి మండలంలో అంట్లపాలెం, వడ్డిప, కొవ్వూరు తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం డ్రోన్ వదిలి ఆయా మార్గాలను పరిశీలించాచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోలుగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వారిపై నిరంతర డ్రోన్ నిఘా ఉంటుందన్నారు. చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాలువ గట్టును కొల్లగొట్టి..

- యథేచ్ఛగా పోలవరం కాలువ గట్టు గ్రావెల్ తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు



గట్టు నుంచి గ్రావెల్‌తో వెళ్తున్న ట్రాక్టర్



పోలవరం కాలువ గట్టు గ్రావెల్ తవ్విన దృశ్యం

పాయకరావుపేట: మండలంలో పోలవరం కాలువ గట్టును కొల్లగొడుతూ పలువురు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. మట్టి తరలింపు దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పాయకరావుపేట మండల పరిధిలోని పోలవరం కాలువ గట్టును రాత్రి, పగలు అనే తేడా లేకుండా పొక్లెయిన్‌తో తవ్వి, టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నారు. స్థానిక పీఎల్‌పురం గ్రామంలోని కాలువ గట్టు సగానికి తరిగిపోయింది. టిప్పర్ గ్రావెల్ రూ.5 వేలు నుంచి రూ. 6 వేలు, ట్రాక్టర్ గ్రావెల్ రూ.1000కు అమ్మకాలు సాగిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో అక్రమంగా వేస్తున్న లేఅవుట్లలోను, పునాదులను నింపుకోవడానికి గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పోలవరం కాలువ గట్టు పనులు పరిశీలించడానికి పాయకరావుపేట పరిధిలో ఒక డీఈ, మరో ఐదుగురు ఏఈలు, సిబ్బంది ఉన్నప్పటికీ గ్రావెల్ అక్రమ రవాణా మాత్రం యథేచ్ఛగా సాగిపోతోంది.

భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా సాగునీరు

కాలువ గట్టు మట్టిని తరలించుకుపోతే రానున్న రోజుల్లో సాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం కాలువ గట్టు పొడవునా రెండు వైపులా గ్రావెల్ తరలించుకుపోతున్నారు. అయినా సంబంధిత అధికారులు గానీ, రెవెన్యూ, పోలీసు అధికారులు గానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మైనింగ్ అధికారులు దృష్టి సారించవలసి ఉన్నప్పటికీ తమకేందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పీఎల్ పురం గ్రామంలో గ్రావెల్ రవాణా కారణంగా రోడ్లు ధ్వంసమవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పోలవరం కాలువ గట్టు మట్టి రవాణాపై దృష్టి సారించి, నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పోలవరం కాలువ ఏఈ సుబ్రమణ్యంను సంప్రదించగా.. రాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలించుకుపోతున్నారన్నారు. తమ తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు, ట్రాక్టర్లకు జరిమానా వేసి, పోలీసులకు అప్పగిస్తున్నామన్నారు.

'ఎంపీపీపై అవిశ్వాసం' అంతా బూటకపు ప్రచారమే



మాట్లాడుతున్న ఎంపీటీసీ రావి నాగలక్ష్మి, శోభన్‌బాబు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం ఎంపీపీపై అవిశ్వాసమంటూ బూటకపు ప్రచారానికి తెరలేపారని వైఎస్సార్‌సీపీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు రావి శోభన్‌బాబు ధ్వజమెత్తారు. కొండకర్ల ఆవలోని పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ రావి నాగలక్ష్మితో కలిసి ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 'ఎంపీపీపై అవిశ్వాసం'శీర్షికతో శనివారం ఓ దినపత్రికలో ప్రచురితమైన కథనం కూటమి కుటిలత్వానికి నిదర్శనమన్నారు. విజ్ఞానవంతులైన విలేకర్లు ఆలోచనతో తగిన ఆధారాలతో వార్తలు రాయాలని హితవు పలికారు. కూటమి అంటేనే కుళ్లు, కుతంత్రాలు, కుటిలత్వంతో కూడిన పార్టీ అని ఆయన విమర్శించారు. పలువురు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు జనసేనలో చేరకుండానే చేరారని వార్తలు రాయడం సమంజసం కాదన్నారు. తమ పార్టీ గుర్తుతో గెలిచిన ఎంపీటీసీలు ఎవ్వరూ పార్టీ మారే ఆలోచనలో లేరని ఎంజేపురం ఎంపీటీసీ రావి నాగలక్ష్మి స్పష్టం చేశారు. కూటమిలో ఉంటే అభివృద్ధి చేయలేకపోతున్నామని ఆవేదనతో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరిన మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మియే ఇందుకు నిదర్శనమన్నారు. అధికారంలోకి వచ్చాక కొంత మంది కూటమి నాయకులు మాయమాటలు చెప్పి పార్టీలో చేర్చుకున్నారని, తరువాత పట్టించుకోకపోవడంతో తిరిగి సొంత గూటికి చేరుకున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎంపీటీసీలు ఎవరూ కూటమిలో చేరే ఆలోచన చేస్తారా? అని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇటువంటి తప్పుడు రాతలు రాయడం మానుకోవాలన్నారు.

ఆదర్శంగా నిలిచిన స్నేహబంధం



దేవర చిలుకునాయుడుకు సాయం అందిస్తున్న స్నేహితులు

అచ్యుతాపురం రూరల్ : ఆపదలో ఆదుకునే వారే స్నేహితులని అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు నిరూపించారు. బుచ్చయ్యపేట మండలం ఆర్.శివరామపురానికి చెందిన దేవర చిలుకునాయుడు అచ్యుతాపురం హైస్కూల్‌లో 1998–99 బ్యాచ్‌తో కలిసి చదువుకున్నారు. ఈయన దివ్యాంగుడైనప్పటికీ విద్యాభ్యాసం, ఆటపోటీల్లో చురుగ్గా ఉండేవారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈయన కుటుంబం ఛిన్నాభిన్నమైంది. చిలుకునాయుడు తన భార్య, చిన్న కుమార్తెను మూడు చక్రాల వాహనంపై ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో భార్య మృతి చెందగా, ఆయన కాలు, చేయి విరిగిపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న తన స్నేహితులు సుమారు రూ.87వేలు సేకరించి బాధితుడికి శనివారం అందజేశారు. భవిష్యత్తులో ఎటువంటి అవసరమైనా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత



గంటవానిపాలెం పార్టీ శ్రేణులతో సమన్వయకర్త ధర్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, తదితరులు

మునగపాక: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో భాగంగా శనివారం రాత్రి మండలంలోని గంటవానిపాలెంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పాలన సాగించిన రోజుల్లో నవరత్నాలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రతి పేదవానికి అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలన్నారు. కమిటీల నియామకంపై దృష్టి సారించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ నాయకులు నందవరపు భాస్కరరావు, అరిగా శ్రీనివాసరావు, బొండా కన్నబాబు, సేనాపతి వెంకయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సవాళ్లను అధిగమించాలి



అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న సుందరం, నరసింహారావు, తదితరులు

పాయకరావుపేట: విద్యార్థులు సవాళ్లను అధిగమించి, అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ ఆర్.ఎం.సుందరం కోరారు. స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన యువ ప్రేరణ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు మార్కుల కోసం కాకుండా జ్ఞాన సముపార్జనపై దృష్టి పెట్టాలన్నారు. కృత్రిమ మేధస్సుతో పనులు జరిగే ఈ రోజుల్లో మన ఆలోచనల్లో సృజనాత్మకత లేకపోతే యాంత్రికంగా మిగిలిపోతామన్నారు. ఓటమి అనేది ప్రయత్నం సరైనా పద్ధతిలో లేనప్పుడు మాత్రమే పొందుతామని, నిరాశ చెందకుండా సవాలుగా తీసుకుని ముందుకు సాగితే గెలుపు సొంతమవుతుందన్నారు. అనంతరం మండలి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి.ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇచ్చే ప్రేరణతో ఉన్నత శిఖరాలను చేరగలమన్నారు. మార్కులు మీ మేధస్సుకు కొలమానం కాదని, లక్ష్య సాధన కోసం మొదటి నుంచి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గెలుపు ఒక్కరోజులో పొందే ప్రక్రియ కాదని, గెలుపు సాధించాలంటే కొన్ని సంవత్సరాలు కఠోర శ్రమ అవసరమని చెప్పారు. అనంతరం శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు, ప్రెసిడెంట్ కంటిపూడి నరేంద్రబాబు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్, అతిథులు అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, డీన్ బంగార్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ ఆవరణ బురదమయం



చిత్తడిగా దర్శనమిస్తున్న ఎంపీడీవో కార్యాలయ ఆవరణం

కోటవురట్ల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణం బురదమయంగా తయారైంది. వివిధ సమస్యలపై వచ్చేవారికి ఇక్కట్లు తప్పడంలేదు. చిన్నపాటి వర్షం కురిసినా మెయిన్ రోడ్డుపై నుంచి వర్షపు నీరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోకి వస్తోంది. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో ఒండ్రుపట్టి బురదమయంగా తయారవుతోంది. దాంతో అధికారులు, మండల ప్రజలకు అవస్థలు తప్పలేదు. కార్యాలయంలోకి వెళ్లాలంటే బురదలో జారుతూ సాహసం చేయాల్సిందే. చాలా కాలంగా సమస్య ఉన్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. మెయిన్ రోడ్డుపై నీరు ఇక్కడకు దగ్గరలో ఉన్న తుపాకుల గెడ్డలోకి పోయేలా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

దుకాణాలు ముందుకు జరిపితే చర్యలు



అడ్డురోడ్డు వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులో వ్యాపార దుకాణాలను ముందుకు జరిపి ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ హెచ్చరించారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో స్థానిక వ్యాపారులతో శనివారం ఆయన మాట్లాడారు. రేవుపోలవరం, అడ్డురోడ్డు రూట్లలో ట్రాఫిక్ సమస్య తరచూ తలెత్తుతోందని, ఈ మేరకు తమకు ఫిర్యాదులు కూడా వచ్చాయన్నారు. రోజురోజుకూ జంక్షన్‌లో రద్దీ తీవ్రత పెరుగుతోందని, వ్యాపారులు పార్కింగ్‌కు స్థలం ఉంచి వ్యాపారం కొనసాగించాలన్నారు. ఒకరిని చూసి మరొకరు దుకాణాల ముందు పర్మినెంట్ షెడ్డులు, మెస్‌లు పెట్టి వినియోగదారుల వాహనాలు నేరుగా రోడ్డుపై నిలిపేలా చేస్తున్నారన్నారు. మరికొందరు దుకాణాలను ముందుకు జరిపి, మరో చిరు వ్యాపారి దుకాణం ఏర్పాటు చేయించి రోడ్డును ఇరుకుగా మార్చేస్తున్నారన్నారు. వారం రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం ఉండాలన్నారు. ఆ తరువాత నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ విభీషణరావు, వ్యాపారులు రామ్‌కోటి, శేషు, జగదీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

అట్టర్ ఫ్లాప్ పాలనకు విజయోత్సవాలా?

- 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించడం సిగ్గుచేటు
- ఎన్నికల ముందు హామీలిచ్చి ప్రజల్ని మోసగించిన చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ
- 8, 9, 10 వార్డుల్లో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ




పట్టణంలో జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: కూటమి 16 నెలల అట్టర్ ఫ్లాప్ పాలనకు విజయోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. యలమంచిలి మున్సిపల్ పరిధిలోని 8, 9, 10 వార్డులకు సంబంధించి 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ధర్మశ్రీ తొలుత కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన స్థానికులు, పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 16 నెలలుగా అన్ని వర్గాల ప్రజల్ని మోసగించిన చంద్రబాబు, కూటమి ప్రభుత్వ పెద్దలంతా కలిసి ఈ నెల 10న అనంతపురంలో నిర్వహించిన విజయోత్సవాలను చూసి మహిళలంతా ఇదేమి విచిత్రమని ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనబెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడంలో.. 5 లక్షల పింఛన్లు తొలగించడంలో.. 20 లక్షల ఉద్యోగాలిస్తామని మోసం చేయడంలో.. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్లు ఇస్తామని మోసం చేయడంలో సూపర్ హిట్ సాధించారని ఎద్దేవా చేశారు. 87 లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వాల్సి ఉండగా 54 లక్షల మందికే ఇచ్చి, 16 నెలల్లో ఒక గ్యాస్ సిలిండర్ మాత్రమే ఇచ్చి, కేవలం 5 రకాల బస్సుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి అన్నింటా అట్టర్ ఫ్లాప్ అయ్యారన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి మొదటి ఏడాది పంగనామం పెట్టారని, రెండో ఏడాది రూ.5వేలు మాత్రమే ఇచ్చి 7 లక్షల మందికి కోత వేశారన్నారు.

17 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

వైఎస్ జగన్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు చేసిన 17 మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు కారు చౌకగా ధారాదత్తం చేయడం అత్యంత దురదృష్టకరమైన నిర్ణయంగా ధర్మశ్రీ అభిప్రాయపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 17 జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని, అందుకు తగినట్టుగా ఒక్కో కాలేజీకి ఎకరం విలువ రూ.5 కోట్లు చొప్పున 50 ఎకరాల స్థలం కేటాయించి భవనాల నిర్మాణం ప్రారంభిస్తే వాటిని ప్రైవేటుకు అప్పగించాలన్న కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కళాశాలను కూడా స్థాపించలేదని, ఎంతో ఉదాత్త ఆశయంతో 17 మెడికల్ కాలేజీలను వైఎస్ జగన్ ఏర్పాటు చేసి మొనగాడిగా నిలిచారన్నారు. వాటిలో 10 కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు అమ్మేయాలనుకోవడం దారుణమన్నారు. సూపర్‌సిక్స్‌తో పాటు 143 వాగ్దానాలిచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి పట్టణం, రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర్రావు, అర్రెపు గుప్తా, దూది నర్సింహమూర్తి, కొఠారు కొండబాబు, పిల్లా త్రినాథరావు, దిగుమర్తి నానాజీ, మాడుగుల సత్యనారాయణ, నానేపల్లి చిరంజీవి, పక్కుర్తి శంకర్, వార్డు కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, రాపేటి సంతోష్, ఈరిగిల చంటి, గొర్లి వెంకట్, దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ, రాధా మోహన్, పెద్ద సంఖ్యలో మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆటో డ్రైవర్ సైకిల్ యాత్ర



అడ్డురోడ్డు చేరుకున్న హరేరాం సైకిల్ యాత్రలో పాల్గొన్న స్థానిక ఆటో డ్రైవర్లు

ఎస్.రాయవరం: కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలను రోడ్డున పడేసిందని అడ్డురోడ్డు ఆటో యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజువాకకు చెందిన ఆటోడ్రైవర్ శిరియాల హరేరాం అమరావతికి తలపెట్టిన సైకిల్ యాత్ర శనివారం అడ్డురోడ్డు చేరుకుంది. అడ్డురోడ్డు ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సదుపాయం కారణంగా తమ ఉపాధికి పూర్తిగా గండిపడిందని ధ్వజమెత్తారు. ఆటో ఫైనాన్స్ ఎలా కట్టాలని, కుటుంబ పోషణ ఎలా చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది ఒకసారి వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు ఇస్తే ఎలా సరిపోతుందని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం హరేరాంను సత్కరించారు.

16 నుంచి 18 వరకు జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు



జిల్లాస్థాయి చెడుగుడు పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాన్‌జిమ్ అధినేత విజయ్

మునగపాక: మరిడిమాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని మునగపాకలో ఈ నెల 16 నుంచి 18 వరకు జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్లు డాన్‌జిమ్ అధినేత పెంటకోట విజయ్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయిలో చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్న జూనియర్ హైటెక్ సభ్యులను అభినందించారు. సంతబయిల రామాలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఎంట్రీ ఫీజుగా రూ.200 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆడారి వెంకటేష్, దొడ్డి సాయి, టెక్కలి శివ గణేష్, కర్రి శివ, టెక్కలి యోగి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న అధికార పార్టీ నాయకులు



డిప్యూటీ తహశీల్దార్‌కు వివరాలు తెలియజేస్తున్న సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు

అచ్యుతాపురం రూరల్ : దుప్పితూరు పంచాయతీలో అభివృద్ధి పనులకు మాజీ సర్పంచ్ కుమారుడు, టీడీపీ నాయకుడు ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు అడ్డుపడుతున్నారని సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు ఆరోపించారు. ఈ మేరకు దీనిపై స్థానిక తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నాగేశ్వరరావు తల్లి గతంలో దుప్పితూరు సర్పంచ్‌గా చేశారని, ఆ సమయంలో దుప్పితూరు సచివాలయం ముఖద్వారం మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. ఆ రహదారి ప్రస్తుతం పూర్తిగా శిథిలమవడంతో గ్రామ పంచాయతీలో రోడ్డు వేయడానికి తీర్మానం చేశామన్నారు. ఈ మేరకు రహదారి నిర్మాణం చేస్తుంటే ప్రతిపక్ష సర్పంచ్‌ని అవడం కారణంగా అక్కసుతో అడ్డుకుంటున్నారన్నారు. 2017లో రోడ్డు నిర్మించినప్పుడు పోరంబోకు గెడ్డ కానిది, ఈ రోజు రోడ్డు పునర్నిర్మాణం చేస్తున్నప్పుడు పోరంబోకు ఎలా అయిందని ప్రశ్నించారు. ప్రస్తుత నాలుగు సంవత్సరాల్లో అభివృద్ధి చేయడంతో తట్టుకోలేక అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు పూర్తి విచారణ చేపట్టి రహదారి నిర్మాణానికి సహకరించాలన్నారు.

శారదాలో తగ్గిన నీటి ప్రవాహం

కశింకోట: స్థానిక గవరపేటలో శనివారం శారదా నది నీటి ప్రవాహం తగ్గింది. దీంతో దోనె ప్రయాణాలు పునః ప్రారంభయ్యాయి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో శుక్రవారం దోనె ప్రయాణాలు నిలిపి వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నీటి మట్టం తగ్గినప్పటికి ఉధృతి ఎక్కువగా ఉన్నందున పరిమితంగానే రైతులను తమ పొలాలకు, పశువుల శాలలకు దోనెలపై వెళ్లడానికి అనుమతించారు. దీంతో మిగిలిన రైతులు ఇబ్బంది పడ్డారు.